క్లుప్తంగా

ముమ్మరంగా వాహన తనిఖీ



వాహనాల రికార్డులు పరిశీలిస్తున్న ఎస్‌ఐ

సంబేపల్లె : మండల పరిధిలోని చిత్తూరు – కర్నూలు జాతీయ రహదారిపై బుధవారం ఎస్‌ఐ భక్తవత్సలం వాహనాలు తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించి రికార్డులు లేని వాహనాలపై చలానాలు విధించారు. అనంతరం వాహదారులకు రహదారి సూత్రాలు పాటించాలని అవగాహన కల్పించారు.

అవగాహనతోనే ప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి

రాయచోటి టౌన్ : ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటిస్తూ ఇతరులకు అవగాహన కల్పించాలని రాయచోటి ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి విద్యార్థులకు సూచించారు. బుధవారం రాయచోటి సీఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నియమ నిబంధనలు తెలియజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ నిబంధనలు పాటిస్తేనే సాధ్యమన్నారు. వాహనాన్ని వేగంగా నడపకూడదన్నారు. మద్యం సేవించి వాహనం నడిపితే ప్రమాదాన్ని కొనితెచ్చుకున్నట్టే అనేది గుర్తించుకోవాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే అలాంటి వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఆర్ రెడ్డి కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసుల రెడ్డి పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ‘పొలం పిలుస్తోంది’



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీలత

చిన్నమండెం : మండల పరిధిలోని బోనమల, కేశాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించినట్లు మండల వ్యవసాయాధికారిణి గీత తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీలత మాట్లాడుతూ పంటల బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. టమాటా, వేరుశనగ పంటలకు డిసెంబర్ 15లోపు, వరికి డిసెంబర్ 1లోగా ప్రీమియం చెల్లించాలని చెప్పారు. రైతులకు పలు సూచనలు, సలహాలను అందజేశారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది పావని, సింధూజ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం



క్రైమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న జడ్జి నందిని

నందలూరు : డిసెంబర్ 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన కేసుల పరిష్కారానికి కృషి చేయాలని నందలూరు కోర్టు జడ్జి జె.నందిని పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి నందలూరు కోర్టు పరిధిలోని పోలీస్ స్టేషన్ల అధికారులతో బుధవారం జడ్జి క్రైమ్ మీటింగ్ నిర్వహించారు.

కురవపల్లిలో పశు వైద్య శిబిరం



దూడలకు టీకాలు వేస్తున్న అధికారులు

సుండుపల్లె : మండల పరిధిలోని మడితాడు గ్రామ పంచాయతీ కురవపల్లి గ్రామంలో పశు గణాభివృద్ధి, గర్భకోశ చికిత్సలపై రైతులకు అవగాహన సదస్సును జిల్లా అధికారి డాక్టర్ గుణశేఖర్ పిళ్లై బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 658 గొర్రెలకు నట్టల నివారణ మందులు, 54 ఆవులు, 12 గేదెలకు గర్భకోశ నివారణ చికిత్సలు చేసినట్లు తెలిపారు. అనంతరం 36 దూడలకు టీకాలు అందించారు. కార్యక్రమంలో రాయచోటి ఉప సంచాలకులు డాక్టర్ డి.మాలకొండయ్య, కడప ఏడీడీఎల్, ఈజీఓ రమేష్, సుధాకర్, రంగస్వామి, సుండుపల్లె ఏడీ విజయ్ కుమార్, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతర పంటలపై రైతులకు అవగాహన

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని రెడ్డివారిపల్లి, ఓబనపల్లి, ఎర్రమిట్ట తదితర గ్రామాలలో ఏఓ సుధాకర్, హెచ్‌ఓ భాస్కర్‌లు అంతర పంటలపై బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పంటలపై దృష్టి సారిస్తే అధిక ఆదాయాలు పొందవచ్చని వారు తెలిపారు. ముఖ్యంగా మామిడి, అరటి, బొప్పాయి తదితర పంటలలో ప్రారంభ దశలోనే అంతర పంటలపై దృష్టిసారిస్తే పెట్టుబడులు, పంట ఖర్చులకు దిగుబడి పొందవచ్చని పేర్కొన్నారు.

పారిశుధ్య దుస్థితి.. ప్రజారోగ్యం అధోగతి

- అపరిశుభ్రతకు నిలయాలుగా గ్రామ పంచాయతీలు
- క్షేత్రస్థాయి పర్యటనలు పట్టని మండలాధికారులు
- చర్యలు చేపట్టాలంటున్న మండల ప్రజానీకం



కడపాయపల్లె ప్రధాన రహదారి పక్కనే పేరుకుపోయిన చెత్త



సిద్దవటంలోని చావిడి వద్ద పేరుకుపోయిన వ్యర్థాలను తింటున్న ఆవులు



మంగళవాండ్లపల్లె గ్రామంలోని ప్రధాన రహదారిలో మురుగునీరు

సిద్దవటం : నిత్యం వాహనాలు రద్దీగా ఉండే కడప – బద్వేల్ ప్రధాన రహదారిలోనే పారిశుధ్యం పడకేసినా పాలకులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిదులు ఈ రహదారి గుండా సంచరిస్తున్నప్పుడు ఇబ్బందులు వస్తాయేమోనన్న భయం కూడా పాలకుల్లో లేదన్నది ఈ అపరిశుభ్రతను చూస్తే ఇట్టే అర్థమవుతుంది. మండల కేంద్రమైన సిద్దవటంలోని చావిడి వద్ద ప్రధాన రహదారిలో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు వేసే చెత్తతో దిబ్బలా తయారైంది. అందులో ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇండ్లలోని వ్యర్థ పదార్థాలు ఉండగా వాటిని ఆవులు తిని మృత్యువాత పడుతున్నాయి. ఇటీవలే ఒక ఆవు ప్లాస్టిక్ వ్యర్థాలు తిని కోట వద్ద మృత్యువాతకు గురైంది. అధికారుల ఎప్పుడో ఒకసారి తూతూమంత్రంగా క్షేత్రస్థాయిలో పర్యటించి వారానికి ఒక సారి డ్రైనేను పాటించండి, నీటి డ్రమ్‌లను శుభ్రంగా ఉంచుకోండని మాటలు చెప్పి మమ అనిపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించే నాథుడు లేకపోవడంతో అపరిశుభ్రత వాతావరణం తాండవిస్తుంది. మాధవరం-1 గ్రామ పంచాయతీలో చెత్తాచెదారం, మురుగునీరు దరన్నమిస్తున్నాయి. తీవ్ర దుర్గంధం వల్ల రోగాల బారిన పడి ఆసుపత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అంతేగాకుండా మండలంలోని కడపాయపల్లె, మంగళవాండ్లపల్లెలో చెత్తాచెదారం రహదారి పక్కనే వేస్తున్నారని, అలానే రహదారిపై మురుగునీరు, బురద ఉండటంతో దుర్వాసనకు తట్టుకోలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చెత్తా, చెదారాన్ని తొలగించి ప్రజారోగ్యానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చెత్తను తొలగించాలి



మా గ్రామంలోని ప్రధాన రహదారిలో, ఇతర ప్రాంతాల్లో చెత్తకుప్పలు పేరుకుపోయి ఉన్నాయి. గ్రామంలో మురుగు నిల్వ ఉంటుండటంతో దుర్వాసన వస్తోంది. దీంతో దోమలు వ్యాప్తి చెంది జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను తొలగించే చర్యలు తీసుకోవాలి.

– సోమా పాలకొండయ్య, మంగళవాండ్లపల్లె, సిద్దవటం

వైభవంగా విగ్రహ ప్రతిష్టాపనోత్సవం



విగ్రహాల ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి

వీరబల్లి : మండలంలోని పెద్దివీడు కొత్తపల్లిలో బుధవారం సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్టను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేయించారు. విగ్రహ ప్రతిష్ట పూర్తయ్యాక సీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి సీతారాముల కల్యాణాన్ని కనులారా తిలకించి ఆనందించారు. అనంతరం హాజరైన భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు రాజేంద్రనాథ్ రెడ్డి, ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి, యువ నాయకులు మదన్ రెడ్డి, వీరనాగిరెడ్డి, వివేకానందరెడ్డి, ధర్మారెడ్డి, మండలంలోని సర్పంచ్లు, ఎంపీటీసీలు, వివిధ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు



మాట్లాడుతున్న రాయచోటి ఆర్‌డీఓ శ్రీనివాస్

రాయచోటి అర్బన్ : గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధ చట్టం (పీసీపీఎన్‌డీటీ యాక్ట్)ను ఉల్లంఘించే ఆసుపత్రులు, స్కానింగ్ సెంటర్‌ల నిర్వాహకులపై కఠిన చర్యలు తప్పవని ఆర్‌డీఓ శ్రీనివాస్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని ఆర్‌డీఓ కార్యాలయంలో పీసీపీఎన్‌డీటీ చట్టంపై రాయచోటి డివిజన్‌స్థాయి సలహా, అథారిటీ సమావేశం నిర్వహించారు. ఆర్‌డీఓ మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్ల యాజమాన్యాలు గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధ చట్టానికి లోబడి పనిచేయాలన్నారు. పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రకారం రిజిస్టర్ కాని స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామంటూ హెచ్చరించారు. ప్రతి గర్భిణి వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలంటూ కోరారు. ప్రతి స్కాన్ సెంటర్, ఆసుపత్రులు సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉండాలన్నారు. 4వ నెల తరువాత జరిగిన అబార్షన్ కేసులను ఆడిట్‌చేసి నివేదికలను సమర్పించాలన్నారు. అబార్షన్‌కు వాడే మాత్రలు వైద్యుల సిఫారసు లేకుండా మందుల షాపులలో అందుబాటులో ఉన్నాయని, వాటిపై డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ చర్యలు తీసుకోవాలంటూ ఆయన ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో పీసీపీఎన్‌డీటీ నోడల్ ఆఫీసర్ ఉషశ్రీ, పోగ్రాం ఆఫీసర్ దేవశిరోమణి, వైద్యులు నిస్సార్ అహమ్మద్, నీలోఫర్ బేగం, జయరాముడు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్, సీహెచ్‌ఓ ఉషారాణి, హెల్త్ ఎడ్యుకేటర్ రాజగోపాల్,సూపర్‌వైజర్ వెంకటేశ్వరరెడ్డి, ఎన్‌జీఓ ప్రతినిధులు సురేంద్రారెడ్డి, నాగేశ్వర్, ఫరీదాబేగం, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలకు దరఖాస్తులు చేసుకోండి

నందలూరు : మండలంలోని దివ్యాంగులు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులను ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు నాగిరెడ్డిపల్లిలోని సురేష్ వద్ద సమర్పించాలని మండల దివ్యాంగుల సేవా సమితి అధ్యక్షులు మహమ్మద్ అలీ కోరారు.

ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది సెప్టెంబర్ నెలలో దివ్యాంగుల ఇండ్ల స్థలాల కోసం స్థానిక తహసీల్దార్‌ను సంప్రదించామన్నారు. సానుకూలంగా స్పందించిన తహసీల్దార్ దివ్యాంగులకు ఇళ్ల స్థలాల విషయంలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. దివ్యాంగులు తమ దరఖాస్తులను అందజేయాలని తెలిపారు.

నేడు అయ్యప్ప గ్రామోత్సవం

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామం ఎర్ర చెరువుకట్టపై వెలసిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి శ్రీ అయ్యప్పస్వామి గ్రామోత్సవం గురువారం సాయంత్రం 5 గంటలకు ఘనంగా నిర్వహించనున్నట్లు అయ్యప్ప సేవా సమాజం వారు తెలియజేశారు. ఈ గ్రామోత్సవం నందలూరు రైల్వే కేంద్రంలోని వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వరకు కొనసాగుతుందని, ప్రజలు, భక్తులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

లక్కిరెడ్డిపల్లి : జిల్లాలో పనిచేస్తున్న 108 అంబులెన్సు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సిబ్బంది సుందరం, రెడ్డిబాబులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 108 సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వం, అధికారులకు వినతి పత్రాలు అందజేశామని వారు పేర్కొన్నారు. శాంతియుతంగా ఆందోళనలకు స్పందించకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి కృషి చేయకపోతే ఈనెల 25 నుంచి సమ్మెకు వెళతామని హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికి పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి

వీరబల్లి : మండలంలోని ప్రజల సమస్యలు తీర్చుటకు ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పనిచేయాలని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. అక్కడ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గ్రామాలలో ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ అభివృద్ధికి పాటుపడాలన్నారు. పార్టీ, వర్గభేదాలు లేకుండా అందరూ కలిసికట్టుగా పనిచేసినప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. దీంతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ముఖ్యంగా రైతులకు ఏమైనా సమస్యలు వస్తే వెంటనే అధికారులు సహకరించి వారి సమస్యలు తీర్చాలన్నారు. రైతు బాగుంటే దేశం బాగుంటుందన్నారు. ముఖ్యంగా మండలంలో ప్రస్తుతం రైతులు ఆశించిన వర్షం పడకపోవడంతో ఎటువంటి పంటలు పెట్టలేక నిరుత్సాహంతో రైతులు జీవనం సాగిస్తున్నారన్నారు. అటువంటి రైతులకు సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్, ఈఓపీఆర్‌డీ రామచంద్రారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కో–ఆప్షన్ మెంబర్, వైఎస్సార్‌సీపీ యువనాయకులు మదన్‌రెడ్డి, వీరనాగిరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

రాజంపేట రూరల్ : ఆకేపాడులోని దేవాలయముల సముదాయం 21వ వార్షిక వేడుకలను ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, జ్యోతమ్మ దంపతులు వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఈ సందర్భంగా వారు పూజులు, హోమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. అలానే మండల పరిధిలోని అచ్చనపల్లి వద్ద కమ్మపల్లి గ్రామంలో శ్రీకృష్ణమందిరం విగ్రహ ప్రతిష్టలో ఎమ్మెల్యే ఆకేపాటి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కాగా ఆలయంలో శ్రీ కృష్ణుని విగ్రహాన్ని ఆకేపాటి తన సొంత నిధులతో ఏర్పాటు చేయించారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

రాయచోటి అర్బన్ : కాంట్రాక్టు కార్మికులుగా పని చేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్రకమిటీ పిలుపు మేరకు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు బుధవారం విద్యుత్‌శాఖ జిల్లా ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నేతలు సుబ్రమణ్యం రాజు, ఏ.వి.రమణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజులు మాట్లాడుతూ కొన్నేళ్లుగా చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలంటూ కోరారు. 2022 పీఆర్‌సీ ప్రకారం వేతనాలను ఇవ్వాలని, పీఆర్‌సీ అరియర్స్ చెల్లించాలంటూ కోరారు. ఈనెల 22న జరిగే హెచ్‌ఆర్ కమిటీ మీటింగ్‌లో కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై చర్చించి తగు న్యాయం చేయాలంటూ విన్నవించారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు నాగేష్ గౌడ్, శ్రీనివాసులురెడ్డి, నాయుడు, రామాంజులురెడ్డి, గజేంద్రవర్మ, పెద్దిరెడ్డితోపాటు పలువురు కాంట్రాక్టు ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

డ్రిప్ ఇరిగేషన్‌ను ప్రోత్సహించాలి



పసుపు పంటను పరిశీలిస్తున్న అధికారులు

సిద్దవటం : 90 శాతం సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ పొందేందుకు రైతులు రైతు సేవా కేంద్రాలలో సంప్రదించాలని, ప్రతి రైతు డ్రిప్ ఇరిగేషన్ వినియోగించుకునేలా ప్రోత్సహించాలని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ తెలిపారు. సిద్దవటం మండలంలోని మోదీన్‌సాబ్‌పల్లె గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజ రబీ పంటల సాగు ప్రణాళికపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఏడీఏ నాగరాజ మాట్లాడుతూ రబీ సీజన్‌లో బోరు బావుల కింద వరికి ప్రత్యామ్నయంగా ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని సూచించామన్నారు. టార్పాలిన్ పట్టలు, పవర్ స్ప్రేయర్‌లు, వ్యక్తిగతంగా సబ్సిడీపై పంపిణీ చేయడం అవసరమని రైతులు తెలిపారన్నారు. పసుపు పంటను పరిశీలించి తగు సూచనలు, సలహాలను చేశారు. అనంతరం మాధవరం–1 రైతు సేవాకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ రమేష్‌రెడ్డి, ఉద్యాన అధికారి భరత్‌రెడ్డి, వ్యవసాయ సహాయకులు ఝాన్సీలక్ష్మీ, మౌనిక, సందీప్ సింహయాదవ్, ప్రేమ్ సందీప్, రైతులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ రాజారత్నం

సిద్దవటం : ప్రభుత్వం మంజూరు చేసిన పక్కా గృహాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ రాజరత్నం తెలిపారు. సిద్దవటం మండలంలోని ఉప్పరపల్లెలో నిర్మాణంలో ఉన్న గృహాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పరపల్లెలో 43 గృహాలు పూర్తి అయ్యాయని, కొన్ని గృహాల పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. లబ్ధిదారులు డ్వాక్రా గ్రూపుల ద్వారా గృహ నిర్మాణాలకు కావలసిన రుణాలను తీసుకొని త్వరగా పనులు చేపట్టాలన్నారు. మార్చి లోపల నిర్మాణాలు పూర్తి కాకపోతే ప్రభుత్వం నుంచి ఎటువంటి బిల్లులు మంజూరు కావని ఆయన పేర్కొన్నారు. రాత్రివేళల్లో కాలనీలో విద్యుత్ దీపాల సమస్య ఉందని, అలానే విష పురుగులు సంచరిస్తున్నాయని జింకా ఓబులేస్ ఆయన దృష్టికి తీసుకురాగా సమస్యను పరిష్కరిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మేరువ బాలాజీ, హౌసింగ్ ఏఈ చెన్నయ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సుబ్బరాయుడు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సునిత, లబ్ధిదారులు పాల్గొన్నారు.

శ్మశాన ప్రహరీ కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి



ధ్వంసమైన శ్మశాన ప్రహరీని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గోసాల దేవి

పుల్లంపేట : మండలంలోని హిందూ శ్మశాన వాటిక ప్రహరీ గోడను టీడీపీకి చెందిన కొంత మంది కూల్చివేశారని ప్రజలు ఆరోపిస్తున్నారు. బుధవారం రైల్వేకోడూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ గోసాల దేవి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శాంతయ్యలు శ్మశాన వాటికను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వారి అరాచకాలకు అడ్డూ, అదుపులేకుండా పోతున్నాయన్నారు. శ్మశాన ప్రహరీని కూల్చివేసి స్థలాన్ని ఆక్రమించాలనుకోవడం దుర్మార్గమన్నారు. పోలీస్, రెవెన్యూ అధికారులు త్వరగా విచారణ చేపట్టి దోషులను శిక్షించాలన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఎస్పీకి బీజేపీ నేత సాయిలోకేష్ ఫిర్యాదు

పార్టీలకతీతంగా ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసిన వారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, అటువంటి వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని బీజేపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సాయిలోకేష్ అన్నారు. బుధవారం శ్మశాన స్థలంలో ధ్వంసం చేసిన ప్రహరీని పరిశీలించి అన్నమయ్య జిల్లా ఎస్పీకి చరవాణి ద్వారా తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ రాజు, చెంగల్‌రాజు, కంబాల శ్రీనివాసులు, చెంగల్‌రెడ్డి, వెంకటరామరాజు, రమణ, రూపేష్ కుమార్, పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి, బికె మణి, పన్నీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యావాహిని విజేతలకు బహుమతుల ప్రదానం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు, ఏకలవ్య ఫౌండేషన్ నిర్వాహకులు

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని చెన్నముక్కపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏకలవ్య ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా వాహిని పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. బుధవారం పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల బాధ్యత, కూరగాయల వ్యర్థాలతో సేంద్రియ ఎరువు తయారీ అనే అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో వివిధ విభాగాలలో విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచారు. జూనియర్స్ విభాగంలో 6వ తరగతి చదువుతున్న అబ్బవరం షణ్ముక ప్రియాంక మొదటి బహుమతి, డి.లక్ష్మణ్, యు.మోక్షశ్రీ, అలాగే సీనియర్స్ విభాగంలో రెడ్డి వెంకట హేమంత్, సి.దినేష్ కార్తిక్, అబ్దుల్ వహాబ్‌లు విజేతలుగా నిలిచారు. నిర్వాహకులు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు హరిబాబు, హెచ్‌ఎం రవీంద్రారెడ్డి, ఆర్.వెంకటరమణ, సునీతమ్మ, సావిత్రమ్మ, ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ లక్ష్మణ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



అయ్యప్పస్వామి పడిపూజలో పాల్గొన్న భక్తులు

ఓబులవారిపల్లె : మంగంపేట కాపుపల్లి గ్రామం రామాలయంలో బుధవారం రాత్రి డీఆర్‌యూసీసీ మాజీ మెంబర్, వైఎస్సార్‌సీపీ నాయకులు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. గురు స్వామి అదనుకోట నరసింహ స్వామి పడిపూజను జరిపించారు. అంతకుముందు అయ్యప్ప స్వామి చిత్రపటాన్ని పూలతో అలంకరించిన పడి మెట్లపై ఉన్న పీఠంపై కొలువుదీర్చారు. పూజలో పెద్ద ఎత్తున మాలాదారులు పాల్గొని స్వామియే శరణమయ్యప్ప అంటూ భజనలు చేశారు. అనంతరం భక్తులకు అల్పాహారాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



గాలివీడు: విజేతలైన విద్యార్థులతో టీచర్లు



చిన్నమండెం: బహుమతులు అందుకున్న విద్యార్థులు



సిద్దవటం: బహుమతులను అందజేస్తున్న హెచ్‌ఎం



ఓబులవారిపల్లె: బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు



సంబేపల్లె: విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న ఎస్‌ఐ భక్తవత్సలం

కొత్త రకం వంగడాలను సాగు చేయండి



సస్యరక్షణపై అవగాహన కల్పిస్తున్న జయరాణి

రామాపురం : మండల పరిధి నీలకంఠ్రావుపేట, సుద్దమళ్ల రైతు సేవా కేంద్రాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని లక్కిరెడ్డిపల్లె డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎమ్.జయరాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. మాట్లాడుతూ వరి, వేరుశనగలో కొత్తరకం వంగడాలను సాగు చేయాలని, అవి కొన్ని రకాల తెగుళ్లకు, పురుగుల వాతావరణ పరిస్థితులకు తట్టుకుంటాయని తెలియజేశారు. భూసార పరీక్షను అనుసరించి ఎరువుల వాడకం చేయడం ద్వారా పెట్టుబడిని తగ్గించుకోవచ్చని తెలిపారు. అనంతరం కృషి విజ్ఞాన శాస్త్రవేత్త మానస మాట్లాడుతూ ప్రస్తుతం మామిడిలో వచ్చే పచ్చపురుగు, తేనే మంచు పురుగుల యాజమాన్యం, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగమణి, డీఆర్‌సీ ఏఓ సుచిత్ర, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతు సేవా కేంద్రం సిబ్బంది హారిక, సర్పంచ్, ఉప సర్పంచ్ రైతులు పాల్గొన్నారు.